www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 డిసెంబర్ 2025

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ సంఘం నాయకులు

కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను శుక్రవారం జిల్లా ఎన్‌జిఒ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వేణు గోపాలరెడ్డి, కార్యదర్శి శ్రీ నివాసన్, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా నాయకులు శివారెడ్డి, నాగేశ్వర్ రావు, మహాదేవ, నరసింహ, పద్మనాభం, దేవేంద్ర, బలరామ రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎన్‌జిఒ నాయకులతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని కోరారు. ఎన్‌జిఒల సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

కదంతొక్కిన అంగన్వాడీలు

- ◆ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ◆ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- ◆ సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- ◆ యాప్‌ల భారం తగ్గించాలి
- ◆ పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- ◆ కలెక్టరేట్ ఎదుట నిరసనలో అంగన్వాడీ, సిఐటియు, ఎఐటియుసి నాయకుల డిమాండ్

అంగన్వాడీలు నిర్వహిస్తున్న ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కదంతొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌ను శుక్రవారం వారంతా సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నినదించారు. వేతనాలు పెంచాలంటూ మూడు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు భాగ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుళమ్మ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సరోజ మాట్లాడుతూ సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని తెలిపారు. గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం వర్కర్స్‌ను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.24,300 ఇవ్వాలన్నారు. హెల్పర్లను మూడవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి రూ.20,400 జీతం ఇచ్చే వరకూ నిరవధిక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. షరతులు లేకుండా 1810 మంది మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం యాప్‌ల పేరుతో పనిభారం పెంచిందే కానీ వేతనం పెంచలేదని మండిపడ్డారు. ప్రమోషన్లు ఇవ్వాలని రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జనాభా కానుగుణంగా కొత్త అంగన్వాడీ కేంద్రాలు తెచ్చి పేద బాలింతలకి గర్భిణులకు ఆహార, ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. అనేక మీటింగ్‌ల పేరుతో నెలలో ఎటువంటి టిఎలు ఇవ్వకుండా 5 నుండి 7 సమావేశాల వరకుకు పిలవడం దారుణమని పేర్కొన్నారు. కనీస వేతనాలతో పాటు పెండింగ్ జీతాలు, బిల్లులు సకాలంలో ఇవ్వాలని కోరారు. అడిగితే, పోరాడితే, ప్రశ్నిస్తే పరిష్కరిస్తారు, లేకుంటే పరిష్కరించకపోవడం బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమని చెప్పారు. రాజకీయంగా వేధింపులు ఎక్కువైనాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న అంగన్వాడీ ఉద్యోగుల పైన రాజకీయ నాయకులు వేధింపులు చేయడం సరైనది కాదని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఇంతవరకు ఇవ్వడం లేదన్నారు. పోపు సామాన్లు, బిల్లులు, పెండింగ్‌లో ఉన్న బాడుగలు రావడం లేదన్నారు. కొత్త భవనాలు నిర్మించాలని తెలిపారు. ఇవన్నీ పరిష్కరించకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజంపేట, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాలకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కలెక్టర్ ఆఫీస్‌లోకి పెద్ద ఎత్తున అంగన్వాడీలు దూసుకుపోవడంతో అర్బన్ సిఐ బి.వి.చలపతి అడ్డుకున్నారు. అంగన్వాడీలు, కార్మిక నాయకులను నిలువరించారు. తర్వాత పీడీ హైమావతి, ఆర్‌డిఒ మధుసూదన్‌రావు వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 16వ తేదీ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఐసిడిఎస్ అధికారులు, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అంగన్వాడీలకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.రంగారెడ్డితో పాటు జిల్లా నలుమూలల నుండి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు, కార్మిక సంఘాల నాయకులు

ఆంగ్లంపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దండి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు ప్రత్యే శ్రద్ధ వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు తరగతి గదులలో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నప్పుడు రాసుకున్న నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థులు రాసుకుంటున్న నోటు పుస్తకాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సరిగా రాసుకుంటున్నారా లేదా అనే అంశంపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న నీటి వసతి, పాఠశాలలో పారిశుధ్యం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తగు సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తుండగా స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లీష్ బాగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల దేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘కృత్రిమ మేధస్సుతో నూతన ఒరవడి సాధించాలి’

ప్రజాశక్తి-పీలేరు

సృష్టి సామర్థ్య కృత్రిమ మేధస్సులో ప్రతి విద్యార్థీ నూతన ఒరవడిని సాధించాలని, అందుకు ఆయా అంశాలపై అందరికీ ముందస్తు అవగాహన చాలా అవసరమని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ ఎంపీ అవినాష్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో విద్యార్థులు తాజా సాంకేతికత నైపుణ్యాలను పెంపొందించుకోవడం తప్పనిసరని పేర్కొన్నారు. అందుకోసమే తాము కళాశాలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని వెబ్ వాయిడ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు సాయి లక్ష్మణ్, రాజేష్, బాలాజీ నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సుతో వస్తున్నా కొత్త పరిణామాలు, వివిధ రంగాల్లో చోటు చేసుకుంటూన్న మార్పులు, భవిష్యత్తులో ఎఐ ఆధారిత సాంకేతికత మరింత విస్తరించబోయే అవకాశాలు వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన అందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రత్యేకించి సృష్టి సామర్థ్య కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను ఉదాహరణలతో విద్యార్థులకు వివరించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలు, పరిశ్రమల్లో పెరుగుతున్న డిమాండ్, విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాల్సిన నైపుణ్యాలపై కూడా దృష్టి సారించినట్లు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎన్.వి.నరసింహరావు మాట్లాడుతూ నేటి యుగంలో సాంకేతిక పరిజ్ఞానం కేవలం విద్యా విషయంలోనే కాకుండా కెరీర్ డెవలప్మెంట్‌లోనూ కీలక పాత్ర పోషిస్తోందని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ చూపడంలో ముందుండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాచమార్గం : జిల్లా జడ్జి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట

రాజీమార్గమే రాచమార్గమని భావించి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం నిర్వహించాఏ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట కోర్టుల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కోర్టు సముదాయంలో విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రాజీ మార్గమే రాజ మార్గంగా భావించి చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ కాగల క్రిమినల్ కేసులు పరిష్కరించుకొని ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని జడ్జి తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సి.టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్, ఎపిపి రామకృష్ణ, బార్ ప్రెసిడెంట్ హనుమంత్ నాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విజేతకు బహుమతి అందజేస్తున్న అధికారులు

ఇంధన పరిరక్షణ అందరి బాధ్యత : ఎస్‌ఇ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇంధన పొదుపు చర్యలు పాటిస్తూ భావితరాలకు భరోసా కల్పించాల్సిన అవసరముందని విద్యుత్ ఎస్‌ఇ ఆడేపూడి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ, ఇంధన పరిరక్షణ మిషన్ భాగస్వామ్యంతో జిల్లా విద్యుత్ శాఖ కార్యాల యంలో శుక్రవా రం ఉదయం డివిజన్ స్థాయి వకృత్వ క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డైట్ అధ్యాపకులచే జిల్లాస్థాయి పోటీలను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భవిష్యత్తు తరాలకు మంచి పర్యావర ణాన్ని అందించేలా ఇంధన వనరు లను బాధ్యతతో విని యోగించాలన్నారు. ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసు కొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చు న్నారు.ఇంధ నాన్ని ఆదాచేసే 5 స్టార్ రేటెడ్ ఉపకరణాలు, ఎల్‌ఇడి బల్బులు వాడటం వల్ల కరెంటు బిల్లు చాలా తగ్గడ మే కాకుండా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర విద్యుత్, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్‌ల గురించి వివరించారు. మన దైనందిన జీవితంలో ఇంధన సంరక్షణ చర్యలను పాటించి, రేపటి తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం పోటీ లలో విజేతలైన వారికి ఇతర శాఖల అధికారులతో కలిసి బహుమతులను అందజేశారు.

విజేతలు వీరే : ఇంధన పొదుపు, నిర్వహణపై నిర్వహించిన వకృత్వ పోటీలలో ప్రథమ స్థానంలో కసిరెడ్డి దేవకి, క్విజ్ పోటీలలో రాజంపేట డివిజన్‌కు చెందిన జి.సమీరా, ఎస్.నిత్యశ్రీ , పి.రెడ్డి సాయి, సివరుణ్ కుమార్ టీం ప్రథమ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, యుగంధర్, అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య చారి, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివ భాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉర్దూ మహోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ఉర్దూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఉర్దూ గ్రంథాలయ అధికారి అన్నారు. ఉర్దూ అకాడమీ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తన సందర్భంగా స్వర్ణోత్సవ పోస్టర్లను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ మనోహర రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ 50 ఏళ్లు పూర్తన సందర్భంగా సురూర్ ఏ ఉర్దూ మహొత్సవం పేరుతో ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న స్వరోత్సవ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్‌బాష, సయ్యద్ షబ్బీర్, కువైట్ సయ్యద్‌బాష, చాను, సాధిక్, షబ్బీర్, పీర్‌బాష, ఉర్దూ అకాడమీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులుగా రామమూర్తి, కిషోర్

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ అధిష్టానం పీలేరు ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి, డైరెక్టర్ గోళ్లకిషోర్ నాయుడులను సదుం మండల ఎన్నికల పరిశీలకులుగా నియమించింది. పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం వారు సదుం మండలంలోని చెరుకువారిపల్లి, తిమ్మనాయన పల్లి, జోగివారిపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు స్థానిక నాయకులతో చర్చించి వారి సాధక బాధకాలు తెలుసుకుని, వారిలో ఐకమత్యంతో పాటు మనోధైర్యాన్ని నింపి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని బరుస ఇచ్చారు. గ్రామంలో అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాలని వారిని కోరారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారికి సరైన సమయంలో తగిన గుర్తింపుతో పాటు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జెఎసి ఆందోళనలు

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని కోరుతూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు నుండి పాత బస్టాండ్ కూడలి వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి జిల్లా కేంద్రం కోసం నినాదాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తొమ్మిది రోజులుగా కొనసాగుతున్నాయి. పాత బస్టాండ్ వద్ద జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో శుక్రవారం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కర్ణాటకం చెంగలరాయుడు, టిడిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, ఊటుకూరు సర్పంచ్ ఈశ్వరయ్య, డాక్టర్ నవీన్ కుమార్, తలిశెట్టి రమేష్, సిద్దిక్, కళాధర్, డాక్టర్ విశ్వనాథ్, డి.ఎస్.రావు, మహేష్, హరీష్, సిసింద్రీ, మన్సూర్, మనోజ్, నాగేంద్ర, సుధాకర్, బాలకృష్ణ, పరశురాం, చెంగయ్య, శివాజీ, శ్రీహరి, ప్రశాంత్, సురేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు, మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు రిలే దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు శుక్రవారం సాయంత్రం దీక్షా శిబిరం వద్దకు చేరుకొని నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-రాజంపేట

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజాదర్బార్ కార్యక్రమ లక్ష్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. స్థానిక నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, విజన్-2047 సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం : ఎమ్మెల్యే



లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మరక్షణ విద్యకు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చక్కని వేదికని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఎమ్మెల్యే అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, చైతన్య సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎంపీ ఆనందన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎ.కవితా రాణి, జీవిఎస్ బాబు, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నవీన్ చౌదరి, తెలుగుదేశం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణ విద్య ఎంతో ముఖ్యమన్నారు. డాక్టర్ స్వర్గీయ ఎఆర్ సురేష్ కరాటేలో మదనపల్లికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. మార్షల్ ఆర్ట్స్ నందు మురళి విద్యార్థులకు చక్కని శిక్షణ అందిస్తున్నారన్నారు. విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ లో ప్రావీణ్యం పొంది విపత్కర పరిస్థితులలో తమను తాము రక్షించుకోవాలని సూచించారు. అకాడమీ నిర్వాహకులు మురళి మాట్లాడుతూ మదనపల్లి జిల్లా ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రజానాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నందు వివిధ కటా విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సత్తా చాటారని వివరించారు.

‘వెలుగు’కు మంచాలు, పరుపులు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విశ్వం సిబిఎస్‌ఇ పాఠశాల విద్యార్థులు వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమాన్ని శుక్రవారం సందర్శించి మంచాలు, పరుపులను వితరణగా అందజేశారు. విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ సందర్శన చేసినట్లు విశ్వం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నిరాశ్రయులైన పిల్లలతో సంభాషించడం వల్ల విద్యార్థులకు దయ, కరుణ విలువను అర్థం చేసుకోవడానికి, అభినందించడానికి సహాయపడుతుందన్నారు. వెలుగు సంస్థ చైర్మన్ ఉదయ మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనా కుమారి అక్కడి విద్యా సదుపాయాల గురించి తెలియజేశారు.సమాజానికి సేవ చేయడం, ఇతరుల సంక్షేమానికి తోడ్పడటం వంటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. ఇటువంటి అనుభవాలు వారి విలువలను రూపొందించి బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మారడానికి సహాయపడతారన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి డివిజన్ ఉపాధ్యాయుల క్రీడా పోటీలు శనివారం నుండి ప్రారంభం అవుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు అదేశాలతో ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను 13, 14వ తేదీలలో డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి పోటీల పర్యవేక్షకులుగా మండల విద్యాశాఖాధికారి 1 అండ్ 2, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఉంటారని చెప్పారు. విజేతలైన జట్లు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. క్రికెట్, బిటి కళాశాల, నక్కలదిన్నె, జడ్‌పి, శ్రీవేద పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు శ్రీ వేద పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని డిసెంబరు 15న ఆత్మార్పణ దినోత్సవంను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఇతర యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. పాఠశాలలకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి మండల స్థాయిలో ఎంఇఒ-2 ఆధ్వర్యంలో 13న, జిల్లా స్థాయిలో పోటీలు 14న డైట్ రాయచోటిలో నిర్వహించనున్నామన్నారు. మండల స్థాయిలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పోటీపడతారని తెలిపారు. బహుమతుల ప్రదాన కార్యక్రమం డిసెంబరు 16న నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని విద్యా సంస్థలు కర్తవ్యబద్ధంగా నిర్వహించి, పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తిని విద్యార్థులకు చేరవేయాలని కోరారు.

అరుదైన పురస్కారం అందుకున్న వినుత

విశిష్ట పురస్కారం అందుకుంటున్న సాధన స్కూల్ కరస్పాండెంట్ వినుత

ప్రజాశక్తి-పీలేరు

పిల్లల విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తూ నిరంతరం శ్రమిస్తున్న పీలేరు సాధనా స్కూల్ కరెస్పాండెంట్ గుండ్రే వినుత మరో అరుదైన పురస్కారం అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్ సిటీలో ఎస్‌డి ప్రోమో సంస్థ ఆధ్వర్యంలో ఈటిటెక్ సంస్థ ప్రోమో ప్రతినిధులు ఆమెకు ఈ ప్రతిభ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాలకు చెందిన అతిథులు, ప్రముఖులు వినుత రెడ్డి సేవలను ప్రశంసించారు. తాను విద్యా సేవల ద్వారా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాకుండా, తల్లిదండ్రుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యావేత్తగా ఆమెను వారు అభినందించారు. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సాధనా చిల్డ్రన్స్ అకాడమీ, కార్పొరేట్ విద్యాసంస్థల సరసన నిలిచి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తోంద పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మా స్కూల్ తరపున 15 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం విశేషమని చెప్పారు. అంతేకాకుండా పీలేరు మండలంలో తమ విద్యాసంస్థ అగ్రస్థానంలో నిలవడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. 2025 విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా రెండు ప్రతిభా పురస్కారాలను అందుకున్నారన్నారు. తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో స్థిరపడి సేవలు అందించడం నిజంగా తమ సంస్థ ప్రతిభకు పట్టాభిషేకమేనని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని పట్టణంలోని తోటవీధికి చెందిన బాయిగడ్డ దశరథ రామవంశీ అన్నారు. శుక్రవారం తన కుమార్తె బాయిగడ్డ నూత్న పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక చౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. తదనంతరం స్థానిక వాల్మీకి నగర్‌లోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, ఆశ్రమ నిర్వాహకురాలు మంజుల, కుటుంబ సభ్యులు రెడ్డిరాణి, రమ్య, సౌజన్య, రామక్రిష్ణ, సుజాత, ఆసుపత్రి సిబ్బంది సుధాకర్, విజ్ఞాన్, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలను నీటిలో వదులుతున్న అధికారులు

సోమశిల వెనుకజలాల్లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - నందలూరు

మండలం లోని కోనాపురం గ్రామ సమీపం లోని సోమశిల వెనుక జలాల యందు తిరుపతి జిల్లా కల్యాణి డ్యాం మత్స్య క్షేత్రము నుండి 11.5 లక్షల చేప పిల్లలను శుక్రవారం అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు మత్స్య శాఖ అధికారులు, గ్రామ మత్స్య కారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా మత్స్యకారుల ఆర్థికా భివృద్ధికి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొొచ్చిందన్నారు. మత్స్యకారుల ఉపాధిని మెరు గుపరిచి వారు ఆర్థికంగా ఎదిగేం దుకు నాణ్యమైన చేప పిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.కార్యక్రమము లో మత్స్య శాఖ అన్నమయ్య, చిత్తూరు జిల్లా అధికారులు సుస్మిత, రవికుమార్, తిరుపతి జిల్లా కళ్యాణి డ్యాం మత్స్య అభివృద్ధి అధికారి వెంకటరమణ , పశుసంవర్తక శాఖ అధికారి ఈశ్వర ప్రసాద్, రాజంపేట సహాయ మత్స్య పర్యవేక్షకులు మురళీకృష్ణ , పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, గ్రామమత్స్యకారులు పాల్గొన్నారు.

రిషిత్‌వర్మను సన్మానిస్తున్న శ్రీరాములు, ఎంఇఒ

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రిషిత్‌వర్మ

ప్రజాశక్తి-పుల్లంపేట

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన రిషిత్‌వర్మను ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఘనంగాసన్మానించారు. గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని ఎపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ లీలాశ్రీహరి తెలిపారు. గురువారం రిషిత్ వర్మను ఎంఇఒ నాగ తిరుమలరావు, అధ్యాపక బృందం అభినందించారు. ఎస్‌బివిడి సభ జూనియర్ కళా శాల విద్యాసంస్థల అధినేత నూకల శ్రీరాములు ఘనంగా సన్మానించి జాతీయస్థాయిలో విజయం సాధించాలని సూచించారు.కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీరాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి-రాజంపేట

సిఎంకు వినతి పత్రం ఇస్తున్న రవికుమార్‌నాయుడు

రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని టిడిపి రూరల్ మండలాధ్యక్షులు మేడికొండ రవికుమార్‌నాయుడు శుక్రవారం మంగళగిరిలో సిఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1902 ఆంగ్లేయుల కాలం నుంచి రాజంపేటలో సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఉందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు 15 ఎకరాల సువిశాలమైన సబ్ కలెక్టర్ కార్యాలయం ఉందన్నారు. పుష్కలమైన తాగు నీటి వనరులతోపాటు జాతీయస్థాయిలో రోడ్డు కనెక్టివిటీ, అందుబాటులో రెండు విమానాశ్రయాలు, రైలు మార్గం ఉందని వివరించారు. చారిత్రక కట్ట డాలు, ఆలయాలు రాజంపేట సొంతమన్నారు. అంతేకాకుండా అన్ని నియోజ కవర్గా లకు కేంద్ర బిందువుగా మధ్యలో ఉంటుందని ముఖ్యమంత్రికి వివరించారు.

విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందిస్తున్న సూర్యనారాయణ

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - నందలూరు

విభిన్న ప్రతిభావంతులను ప్రొత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నాగిరెడ్డిపల్లె జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంత పిల్లలకు ఉపకరణాలు, రవాణా బత్యం, స్టైఫండ్, ఎస్కార్ట్ అలవెన్స్, చిన్నపాటి శస్త్రచికిత్సలు లాంటి కార్యక్రమాలు చేపడుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు కృపానందం, జాతీయ వికలాంగ క్రికెటర్ శివకోటి, ఫిజియోథెరపిస్ట్ ఉమామహేశ్వరరావు, సహిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సుండుపల్లె : మండల కేంద్రంలోని సుండుపల్లిలో టిడిపి మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో 14 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు పాల్గొన్నారు. బిపి, షుగర్, విషజ్వరాలు, కీళ్ల నొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న రమేష్‌నాయుడు

వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

జాతీయ ఆహార నూనె గింజల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం మండల పరిదిలోని రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఎఒతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఆహార నూనె గింజల పథకము క్రింద వచ్చిన వేరుశనగ విత్తనాలను నీటి వసతి కలిగిన రైతులు సద్వినియం చేసుకోవాలని కోరారు. వేరుశనగ పంటలో తీసుకోవలసిన మెలకువలు గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం దేశంలో తినదగిన నూనె గింజల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిం దన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సేకరించడానికి సూక్ష్మ నీటిపారుదల, ఖచ్చితమైన వ్యవసాయం వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను అవలంబించడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం రైతులకు అందిస్తుందన్నారు. అనంతరం భూసార పరీక్ష ఆరోగ్య కార్డులను జింక్ సల్ఫేట్ 10కిలోల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. ఎఒ మాట్లాడుతూ సాగుదారులకు భూసార పరీక్షలు కీలకమని చెప్పారు. భూమిలో ఏఏ పోషకాలు ఎంత మేరా ఉన్నాయో తెలుసుకుంటే మోతాదుకు తగిన విధంగా ఎరువులను వినియోగిం చుకోవ చ్చని తెలిపారు. ప్రతి రైతు భూసార పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేంద్రరెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు అనంతరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నరేంద్రగౌడ్, జనసేన మండల నాయకుడు గుగ్గిళ్ళ వెంకటేష్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి చలపతి, భాస్కర్, బిసి నాయకుడు తుమ్మల రమేష్, సొసైటీ బోర్డు డైరెక్టర్స్, రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు. **రామాపురం** : వేరు శనగ విత్తనా కాయలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. నల్లగుట్టపల్లి. రైతు సేవ కేంద్రంలో వేరుశనగ విత్తనా కాయలను పంపిణీ చేశారు..

జాతీయ ఆహార & పోషక భద్రతా పథకము
National Food Security & Nutrition Mission (NFSNM)

వీరబల్లి : వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న స్వాతి, భానుగోపాల్‌రాజు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ లంలోని నల్లగుట్టపల్లి గ్రామానికి సంబంధించి 30 క్వింటాలు వేరుశనగ విత్తన కాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. అందులో 50శాతంసబ్సిడీతో 30 కేజీల బస్తా రూ.1380 రూపాయలతో టిసిజిఎస్ 1694 నెంబర్ గల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్నమన్నారు. ఈ విత్తన కాయలు ఒక నల్లగుట్టపల్లి గ్రామానికి సంబంధించిందని తెలిపారు. రైతులకు సంబంధించిన సమస్యలు ఉంటే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ప్రజలకు అన్ని విధాల న్యాయం జరిగే విధంగా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఒ నాగమణి మండల టిడిపి నాయకులు ఎస్‌బిఎంఎస్ గ్రూప్ అధినేతలు వీరబల్లి నాగబసిరెడ్డి బసిరెడ్డి, సునీల్‌రెడ్డి, ఎస్.ఎ.అంజనారెడ్డి, రామకృష్ణ గౌడ్ ఎఇఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి : డిహెచ్‌ఇఒ

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

స్క్రబ్ టైఫస్ జ్వరాలపై గ్రామీణ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండా లని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి ఆదేశాల మేరకు గడి గ్రామంలో శుక్రవారం వారపు సంత లో 104సేవలలో స్థానిక పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1610 కేసులు నమోదు అయి 11మంది మృతి చెందారని, ఈ మరణా లకు గల కారణాలు సమీక్ష కొరకు టాస్క్‌ఫోర్స్ బృందం విశ్లేషణ చేస్తోంద న్నారు. జిల్లా లో 45 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కెవిపల్లి, సదుం మండలాల్లో కూడా ఇప్పటికే కేసులు నమోదు అయ్యాయని మండలం పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ అని, ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల కాటిళ్లు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని, అది కాటు వేసిన చోట నల్ల మచ్చ ఏర్పడి తీవ్రమైన జ్వరం వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి వలన 5 రోజులకంటే ఎక్కువగా జ్వరం ఉండుట, శరీరంపై నల్ల మచ్చలు ఏర్పడుతాయని, తలనొప్పి, శరీర నొప్పుల, ఊపిరి తీసుకోవడం లో ఇబ్బంది, బలహీనత, అలసిపోవడం, ఊపిరి తిత్తులు, కిడ్నీ, మెదడు పనిచేయడం లో మందకోడిగా ఉంటాయని తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యు కేషన్ ఆఫీసర్ మహ మ్మద్‌రఫీ మాట్లాడుతూ ఈ వ్యాధి నిర్ధారణ కు రక్త పరీక్ష ఏరి యా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని, చికిత్స లో భాగంగా డాక్టర్ ఇచ్చే డాక్సీసైక్లిన్, అజీత్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుందన్నారు. కార్యక్ర మంలో పర్యవేక్షకులు సుధాకర్, ఎఎన్ఎం ధనలక్ష్మి ఆశాకార్యకర్తలు రెడ్డీబి, రాణి, 104 సిబ్బంది ఆశ, సైద్ బాషా ప్రజలు పాల్గొన్నారు. **గాలివీడు:** అరవీడు గ్రామంలోని లోనిగాండ్లపల్లి జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు మలేరియా సబ్ యూనిట్ అదికారి జయరామయ్య స్క్రబ్ టైఫస్‌పై అవగాహనను కల్పించారు. బ్యాక్టీరియా సూక్ష్మ క్రిమి వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు ను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని,సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ మల్లికార్జున, అయ్యవారమ్మ, వసంత, కళ్యాణి, రమాదేవి,లక్ష్మీదేవి,నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అందాల సుందరి షేక్ రీమా

ఎకో ఇంటర్నేషనల్ ఇండియా-2025గా విజయకేతనం

MISS ECO INDIA
2025

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లికి చెందిన షేక్ రీమా భారతదేశం తరపు నమిస్ ఎకో ఇంటర్నేషనల్ ఇండియా-2025 విజేతగా నిలవడం పట్ల మండల ప్రజల హర్షం వ్యక్తం చేశారు. సుండుపల్లెలోని షేక్ షాహినా, జుహుద్ బాషాలకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. కుమారుడు షేక్ మసూద్‌బాషా ఎంబిబిఎస్ చదువు తున్నాడు. కూతురు షేక్ రీమా బెంగళూరు డిగ్రీ చదువుకుంటూ మోడ లింగ్‌లో రాణిస్తోంది. జుహుద్‌బాషా స్థానికంగా పలు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తు న్నారు. షేక్ రీమా జైపూర్‌లో నిర్వహించిన గ్రాండ్ ఫీనాలేలో మిస్ ఎకో ఇంటర్నేషనల్ ఇండియా-2025 కిరీటం అందుకుంది. వచ్చే ఏడాది జరిగే ప్రపంచస్థాయి పోటీల్లో భారతదేశం తరవున ప్రాతినిధ్యంవహించనుంది. ఈ సందర్భంగా రీమా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె జాతీయ స్థాయిలో రాణించి ప్రపంచ స్థాయి అందాల పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. షేక్ రీమా మాట్లాడుతూ తాను బెంగుళూరులో చదు వుకుంటూ మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకున్నట్లు తెలిపారు. చదువు, క్రీడలతో పాటు మోడ లింగ్‌లో రాణించాలన్న తన ధ్యేయమన్నారు. తల్లిదండ్రుల మద్ద తు ప్రోత్సాహం తన ప్రయా ణానికి బల మైన తోడ్పా టుగా నిలిచాయన్నారు. వారి నమ్మకం, విలువలు, ఆశీ ర్వాదాలు విజయ యాత్రకు ఆశ్రయంగా మారాయని ప్రపంచ స్థాయి అందాల పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంద న్నారు. పది రోజుల క్రితం జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో షేక్ రీమాపాల్గొంది. ప్రపంచ స్థాయి పోటీలకు షేక్ రీమా ఎంపికైందంటూ నిర్వాహకులు ప్రకటించారు.

తూతూ మంత్రంగా భూముల రీసర్వే

సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణలు

పరిషత్ సమావేశ మందిర
రనాథ రెడ్డి సమావేశ మందిరము

మాట్లాడుతున్న ఎంపిపి నూర్జహాన్

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలో జరుగుతున్న భూముల రీ సర్వే తూతూ మంత్రంగా జరుగుతున్నదని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎంపిపి నూర్జహాన్ అధ్యక్షతన ఎంపిడిఒ భానుమూర్తిరావు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మర్రికుంటపల్లి సర్పంచ్‌రెడ్డి రాం, టిడిపి సీనియర్ నాయకులు చిన్న రెడ్డప్ప మరి కొందరు సభ్యులు మరికుంటపల్లిలో జరుగుతున్న భూములు రీ సర్వేలో సర్వే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వాట్సాప్‌లో సమాచారం పంపించి భూమికి సంబంధించిన రైతులు లేకపోయినా, తూతూ మంత్రంగా సర్వే చేయడం, రైతులు అడిగిన సమస్యలు పట్ల స్పందించకపోవడంతో గతంలో జరిగిన తప్పులే మళ్ళీ పునరావృతం అయ్యేవిధంగా రీ సర్వే జరుగుతోందని ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపైన డిటి సైద్ స్పందిస్తూ రీసర్వేలో తప్పులు లేకుండా ఉండేటట్లు సిబ్బందికి ఆదేశిస్తామని, ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతనే సర్వే చేసే విధంగా చూస్తామన్నారు. రైతులకు ఎలాంటి సమస్య లేకుండా రీ సర్వే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌కో ఎఇ ముజుబర్ రెహమాన్ మాట్లాడుతూ ఆర్‌డిఎస్ఎస్ స్కీమ్ మండలంలో అమలవుతుందన్నారు. మండలంలోని 16 ఫీడర్ల పరిధిలోని గ్రామాలలో 24 గంటలు 3ఫేస్ విద్యుత్ అందుబాటులో ఉంటుందని, చిన్న మధ్యతరగతి పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కొత్త సర్వీస్‌కు రూ.1500తో పాటు రూ.2వేలు అదనంగా ఛార్జ్ చేసి తొందరగా సర్వీసు ఇస్తామన్నారు. ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ పథకం కింద 11 చెరువుల అభివృద్ధి కోసం నిధులు కొరకు ప్రభుత్వానికి అంచనాలు పంపించామని ఆరు చెరువుల మరమ్మతులకు రూ.6.90 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం ఐసిడిఎస్, ఇజిఎస్, వెలుగు, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు పాల్గొని తమ శాఖలో ఉండే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒ అశోక్, ఎపిఒ మంజుల, ఎపిఎం దేవసేన, మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు కావ్య గంధ అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

పదవ తరగతి విద్యా ర్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదివి మంచి మార్కులు సాదిం చాలని యుటిఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలం లోని హైస్కూళ్లలో పదో తగరతి విద్యార్థులకు మాదిరి ప్రశ్న పత్రాల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లితండ్రులు, సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు.విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అత్యధిక మార్కులు సాధించి ఉజ్వల భవిత సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి హేమలత, మండల అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, ఉపాధ్యాయులు సంప్రకాష్ యణ, రామచంద్రారెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.30 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఎదురుగా ఉన్న వీధిలోని మాజీ ఎంపిటిసి స్వామి ఎలుమలై ఇల్లు శుక్రవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారులకు సమాచారం అందిం చడంతో వారు వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు ఏలుమలై మాట్లాడుతూ అకస్మాత్తుగా తెల్లవారుజామున తమ బెడ్ రూమ్‌లో మంటలు రావడంతో ముందుగా ఇంటికి సంబంధించిన విద్యుత్ మెయిన్ ఆఫ్ చేసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. అప్పటికే గదిలోని పలు విలువైన వస్తువులు, చీరలతో పాటు బీరువాలో ఉంచిన లక్ష రూపాయల నగదు, 10 తులాల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి, అగ్గిలో కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.30లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వమే తమకు ఆర్థిక సాయం అందించిన ఆదుకోవాలని కోరారు. అగ్నిమాపకశాఖ ఎస్ఐ రాధాకృష్ణ, డిఒబి పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ రవీంద్రబాబు, కె.రాజేశ్వర్ మంటలను అదుపులోకి తెచ్చారు.

ప్రజలతో మాట్లాడుతున్న జడ్జి ఉమర్ ఫరూక్

ఆరోగ్యమే మహా భాగ్యం : జడ్జి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆరోగ్యమే మహా భాగ్యమని తంబళ్లపల్లె జెసిజె కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ అన్నారు. శుక్రవారం ఇట్నేనివారిపల్లెలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి చట్టాలు,న్యాయాలు, కేంద్ర, రాష్ట్ర భీమా పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. మండల న్యాయసేవా సంఘం ద్వారా ప్రజల సమస్యలకు న్యాయ పరమైన సలహాలు అందిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న నాదెళ్ల ద్వారకనాథ్

టెక్నాలజీ వైపు అడుగులు వేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బియూనివర్సిటీలో ఎంసిఎ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్‌కుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎన్.నవీన్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ మిట్స్ కళాశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఎదగడంలో తల్లిదండ్రుల సహకారం అత్యంత కీలకమన్నారు. విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం యూనివర్సిటీ యాజమాన్యం అవసరమైన అన్ని అవకాశాలు, వనరులు అందిస్తుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, నూతన కోర్సులు ఇవన్నీ విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో అవకాశాలు పొందేందుకు దోహదపడు తున్నాయన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల హాజరు, పురోగతులను తరచు కళాశాల సందర్శనల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీలపై పట్టు పెంచుకుని ఉన్నత స్థానాలకు చేరాలని కూడా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ ఎన్.నవీన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సుందరీకరణ పనులు చేస్తున్న కూలీలు

మన్నూరు శ్మశాన వాటికలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక పట్టణంలోని మన్నూరు శివారులోని హిందు శ్మశాన వాటిక సుందరంగా తయారవుతోందని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. గతంలో మన్నూరు శ్మశాన వాటిక కంప చెట్లు, పిచ్చి మొక్కలు, గాజు పెంకులు తదితర వాటితో అధ్వానంగా ఉండేదన్నారు. ఇటీవల ప్రజా దర్బార్‌లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకురాగా తక్షణమే మున్సిపల్ కమిషనర్‌కు సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించడంతో శ్మశాన వాటిక సుందరీకరణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయని తెలిపారు.అడిగిన వెంటనే శ్మశానవాటిక సమస్య పరిష్కరించినందుకు చమర్తి జగన్ మోహన్ రాజుకు ధన్యవాదాలు తెలిపారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

మదనపల్లి సమీపంలోని కొండమర్రిపల్లి గ్రామంలో గురువారం శ్రీ జ్ఞానాంబికా కళాశాల విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లిటరసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భం గా విద్యార్థులు గ్రామస్తులకు మొబైల్ ఫోన్ వినియోగం, ఆన్‌లైన్ సేవలు, ప్రభుత్వ డిజిటల్ పథకాలు, ఆన్‌లైన్ లావాదేవీలు, డిజిటల్ పేమెంట్స్, యూపిఐ భద్రత, సైబర్ సేఫ్టీ వంటి అంశాలపై వివరించి చెప్పారు. కరస్పాండెంట్ గురుప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. దేవేంద్ర నాయక్, ఫిజికల్ డైరెక్టర్ శరత్ కుమార్ పాల్గొని విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతో ఈ డిజిటల్ లిటరసీ కార్యక్రమం విజయవం తంగా నిర్వహించారని పేర్కొన్నారు.

సిఐ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి సిఐ రామచంద్రయ్య సేవలు అభినందనీయమని కురుబ సంఘం మండల అధ్యక్షుడు కనకదాస, మండల కన్వీనర్ వినాయకం లక్ష్మన్న అన్నారు. శుక్రవారం అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సిఐను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు సిఐగా రామచంద్ర భాధ్యతలు చేపట్టారని, అప్పటి నుంచి నిరంతరం ప్రజల్లో ఉంటూ నేరాల నియంత్రణపై తమ సిబ్బందితో గ్రామాల్లో తిరుగుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

ఇస్తేమాకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : కురబలకోట మండలం ముదివేడు గ్రామం ముస్లిం పురంలో శనివారం జరిగే ఇస్తిమా కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల మత కార్యక్రమాలలో ఇస్తిమా ప్రముఖమైందన్నారు.ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ముస్లిములు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి విజయవంతానికి వైసిపి శ్రేణులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బైసాని జ్యోతిచంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.మధుసూదన రెడ్డి, సర్పంచ్ బ్రదర్స్, అంజాద్ ఖాన్, నౌషాద్, కరీముల్లా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముస్లిము పెద్దలకు ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు